క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక



గద్వాలటౌన్: పట్టణ అవోపా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రవిప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా బాలకృష్ణ, ఆర్థిక కార్యదర్శిగా గోవర్ధన్‌శెట్టి, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు బాలస్వామి మాట్లాడారు. సంఘం ఆధ్వర్యంలో సామాజిక సేవ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్, శివశంకర్, సుధీర్, రాము, సురేష్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి.. కేసు నమోదు

గట్టు: మండల పరిధిలోని చాగదోన గ్రామ శివారులోని పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. వివరాలు ఇలా ఉన్నాయి. చాగదోన శివారులోని గూలగట్టు వద్ద పేకాట ఆడుతున్నారన్నా సమాచారంతో దాడి చేసినట్లు తెలిపారు. దాడిలో ఉప్పల కుర్వ మద్దిలేటి, తుమ్మలపల్లి బోయతిమ్మప్ప పట్టుబడగా, ఉలిగెపల్లికి చెందిన కుర్వ జయన్న, లక్ష్మీరెడ్డి, నిమ్మకాయల మునెయ్య, మిట్టదొడ్డి ఆనంద్‌రాజ్, వావిలాల చిన్న, మిట్టదొడ్డి ఆంజనేయులు, తప్పెట్లమొర్సు నాగేంద్రగౌడ్‌తో పాటు పలువురు పారిపోయినట్లు పోలీసులు తెలిపారు. దాడిలో అయిదు ద్విచక్ర వాహనాలు, రూ.5,600 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

స్వయం సేవకుల సమావేశం



అయిజ: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యావాహ కావలి శ్రీనివాసులు మాట్లాడారు. హిందూ ధర్మం, హిందూ సంస్కృతిని పరిరక్షిస్తూ భారతదేశాన్ని స్వశక్తి దేశంగా, విశ్వ గురువుగా నిలబెట్టడానికి ఆర్‌ఎస్‌ఎస్ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాహకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

ధరూరు: వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పని సరిగా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌ఐ శ్రీహరి అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తగు సూచనలు చేశారు. గణేష్ మండపాలు వివాద రహిత ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి మండపం వద్ద తప్పనిసరిగా 3 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సౌకర్యం కోసం స్థానిక విద్యుత్ శాఖ అధికారులతో తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని, ప్రతి మండపంలో 24 గంటల పాటు ఇద్దరు నిర్వాహకులు అందుబాటులో ఉండాలని సూచించారు. డీజే, అధిక శబ్దస్థాయిలో ఉండకూడదన్నారు. మంటలు ఆర్పేందుకు ఇసుక, డ్రమ్ములు ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు.

పందుల స్వైరవిహారం



ఎర్రవల్లి: మండల కేంద్రంలో పందుల పెంపకదారులు విచ్చలవిడిగా ఇళ్ల మధ్యలో పందులను పెంచుతున్నారని, దీంతో నానా అవస్థలు పడుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పందుల బెడద తప్పించాలని కోరుతున్నారు.

కరాటేలో విద్యార్థులకు పతకాలు

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో ఆదివారం జరిగిన నేషనల్ లెవెల్ కరాటే పోటీల్లో జిల్లా కేంద్రానికి చెందిన కింగ్‌షోటోకాన్ విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు ఫౌండర్ జహంగీర్‌పాషా ఖాద్రీ తెలిపారు. ఈ పోటీల్లో ఆయా విభాగాల్లో హుమేర, ఖీజ్ర, హఫ్సా, ఆయేషా, గుల్‌ఫిషా, తనీశ్, అమాన్, సూఫియాన్, సాబేర్‌పాషా, బిలాల్, జుల్ఫికర్, ఫైజాన్, హుజేశ్ బంగారు పతకాలు, నిఖిల్, నబీల్ రజత పతకాలు, ఖాసీం, అహ్మద్ కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులకు నిహాన్ షోటోకాన్ చీఫ్ రవీందర్‌కుమార్ సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు.

సమన్వయ లోపం.. శాపం!

- మరమ్మతుకు నోచుకోని రోడ్డు
- మీరంటే మీరంటున్న అధికారులు
- అంబులెన్స్ కూడా వెళ్లలేని దుస్థితి



కోతకు గురైన వేణిసోంపురం రోడ్డు

అయిజ: మండలంలోని వేణిసోంపురం, చిన్న తాండ్రపాడు గ్రామాల మధ్య ఉన్న రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురయ్యింది. 25 రోజుల గడుస్తున్నా రోడ్డుకు మరమ్మతు చేపట్టలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా అంబులెన్స్ వాహనాలు, స్కూల్ బస్సులు కూడా రోడ్డుపై వెళ్లలేని దుస్థితి నెలకొందని వాపోతున్నారు.

సమన్వయ లోపం

పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖ అధికారుల మధ్య సమన్వయ లోపంతో రోడ్డుకు మరమ్మతు చేపట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్డు పంచాయతీశాఖకు సంబంధించిందని, ఆర్డీఎస్ కాల్వ వెళ్లడంతో రోడ్డు కింది నుంచి వెళ్లడంతో ఇరిగేషన్ అధికారులదని మరమ్మతు చేపట్టడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. రెండు శాఖల అధికారుల సమన్వయ లోపం వలన మరమ్మతు చేపట్టకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నట్లు పేర్కొంటున్నారు.

సొంత ఖర్చులతో మరమ్మతు

గతంలో ఆర్డీఎస్ కాల్వ వద్ద రోడ్డుకు కోతకు గురైనపుడు వేణిసోంపురం, చిన్న తాండ్రపాడు గ్రామస్తులు రోడ్డుకు తాత్కాలిక మరమ్మతు చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి మళ్లీ రోడ్డు కోతకు గురయ్యింది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నివేదిక పంపాం

వేణిసోంపురం– చిన్న తాండ్రపాడు గ్రామాల మధ్య ఆర్డీఎస్ కాల్వ రక్షణ గోడ కూలడంతో కోతకు గురయ్యింది. ఇరిగేషన్ శాఖ వారే మమ్మతు నిర్వహించాల్సి ఉంది. కలెక్టర్ ఎవరికి నిధులు మంజూరు చేస్తే ఆ శాఖ మరమ్మతు పనులు చేపడుతుంది.

– రెడ్డెప్ప, పంచాయతీరాజ్ డీఈఈ

రాకపోకలకు ఇబ్బందులు



వేణిసోంపురం, చిన్న తాండ్రపాడు గ్రామాల మధ్య రోడ్డు వర్షాలకు కోతకు గురవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వర్షం కురిసిన ప్రతిసారి రోడ్డు కోతకు గురవుతుంది. అధికారులు స్పందించి వెంటనే రోడ్డుకు మరమ్మతు చేయించాలి

– చంద్రశేఖర్, చిన్నతాండ్రపాడు

అంబులెన్స్‌కు ఆటంకం



ప్రజల ప్రమాదాలకు గురైనప్పుడు, అత్యవసర వైద్య సేవలు అందించాల్సిన సమయంలో 108 అంబులెన్స్ వెళ్లేందుకు వీలుకావడం లేదు. ప్రత్యామ్నాయంగా వేరే రోడ్లపై వెళ్తే సమయం వృథా అవుతోంది. రోడ్డుకు తక్షణమే మరమ్మతు చేపట్టాలి.

– నరసింహులు, 108 సిబ్బంది

నిరుపయోగంగా డ్వాక్రా భవనం



ఎల్కూరులో డ్వాక్రా భవన ఆవరణలో ముళ్లపొదలు

మండలంలోని ఎల్కూరు గ్రామంలో డ్వాక్రా భవనం నిరుపయోగంగా ఉంది. 14 ఏళ్ల క్రితం రూ.8 లక్షల వ్యయంతో నిర్మించిన డ్వాక్రా భవనం చెరువు సమీపంలో ఉండటంతో మహిళలు ఈ డ్వాక్రా భవనాన్ని వినియోగించకపోవడంతో నిరుపయోగంగా మారింది. దీంతో ఈ డ్వాక్రా భవనం ఆవరణ కంపచెట్లతోపాటు విష పురుగులకు ఆవాసంగా మారింది. రూ.లక్షలు వెచ్చించి నిర్మించినా డ్వాక్రా భవనం వినియోగంలోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రజాధనం వృథా అవుతున్నా అధికారులు మాత్రం కనీస చర్యలు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మల్దకల్

కనులపండువగా కృష్ణస్వామి పల్లకీ సేవ

కేటీదొడ్డి: మండలంలోని కొండాపురంలో కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఆదివారం స్వామివారి పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఉత్సవ మూర్తులను భాజభంత్రీలతో ఆలయం చుట్టు ఊరేగించారు. అనంతరం రథంపై ఉత్సవమూర్తులను ఏర్పాటు చేసి దళవికట్ట వరకు లాగారు. ఉత్సవాలను తిలకించేందుకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఆలయ ఆవరణలో చిన్నారులు కోలాటం ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో నాయకులు శేఖర్‌రెడ్డి, కమిటీ సభ్యులు ప్రసాద్, రేణప్ప, వీరేష్, నర్సమ్మ, తదితరులు పాల్గొన్నారు.



కేటీదొడ్డిలో స్వామివారి పల్లకిసేవలో పాల్గొన్న భక్తులు

దళితవాడలో సమస్యల తిష్ట



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

శాంతినగర్: దళితవాడలో సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడం లేదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్ ఆరోపించారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని రామచంద్రానగర్ దళితవాడ 9వ వార్డులో మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు రామకృష్ణతో కలిసి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కమిషనర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. రామచంద్రానగర్ కాలనీలో మిషన్ భగీరథ నీరు దళితులకు అందక అవస్థలు పడుతున్నారన్నారు. నిత్యావసరాలకు కూడా కొన్ని వార్డుల్లో నీరు రావడం లేదని పేర్కొన్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్ల సమస్యలు పరిష్కరించాలి

గట్టు: ఫొటో, వీడియో గ్రాఫర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఫొటో, వీడియో గ్రాఫర్ల సంఘ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, ఉపాధ్యక్షుడు కమ్మరి వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన ఫొటోగ్రాఫర్లు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సభ్యులందరూ శాశ్వత సభ్యత్వం, కుటుంబ భరోసా సభ్యత్వాన్ని తీసుకోవాలని కోరారు. అనంతరం పలు సమస్యలపై చర్చించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన ఫొటో, వీడియోగ్రాఫర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ఫొటో, వీడియో గ్రాఫర్లు

హిందూ సమాజం ద్వారానే లోకకల్యాణం



మాట్లాడుతున్న జగదీశ్వరయ్య

గద్వాలటౌన్: హిందూ సమాజం ద్వారానే లోక కల్యాణం సిద్ధిస్తుందని విశ్వ హిందూ పరిషత్ ప్రాంత ఉపాధ్యక్షుడు జగదీశ్వరయ్య అన్నారు. ఆదివారం నిర్వహించిన విశ్వహిందూ పరిషత్ సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతీయ సంస్కృతిని దెబ్బతీయడానికి కొన్ని శక్తులు కుట్ర పన్నుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. భారతీయ సంస్కృతి ద్వారానే సమాజంలో ప్రేమ, సుఖ సంతోషాలు సాధ్యమన్నారు. భారతీయ సంస్కృతిపై జరుగుతున్న దాడి ఏ రూపంలో ఉన్నా ఖండించాలని పిలుపునిచ్చారు. గో సంరక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని పిలుపునిచ్చారు. హిందుత్వ వికాసం జరగడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా నాయకులు లక్ష్మీనారాయణ, ఫణిమోహన్ రావు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బద్రోద్దీన్ షావలి గంధోత్సవం



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఖిల్లాఘనపురం: మండలంలోని తిర్మలాయపల్లి శివారులో మహబూబ్‌నగర్‌కు వెళ్లే రోడ్డు సమీపంలో ఉన్న బద్రోద్దీన్‌షావలి దర్గా గంధోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గా ముతవల్లి బద్రోద్దీన్ సాహెబ్ ఇంటి నుంచి గంధంతో దర్గా వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.గంధోత్సవానికి గ్రామస్తులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన వారు పాల్గొన్నారు. సోమవారం ఉర్సు కొనసాగుతుందని ముతవల్లి తెలిపారు. ఉర్సుకు ఉమ్మడి పాలమూరు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరవుతారన్నారు. బద్రోద్దీన్ షావలి దర్గా ఉర్సుకు తరలివచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

మహాసభలను జయప్రదం చేయండి

అమరచింత: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 25, 26న నిర్వహించే ఏఐయూకేఎస్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న పిలుపునిచ్చారు. మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం మండలంలోని ధర్మాపూర్, పాంరెడ్డిపల్లి గ్రామాల్లో రైతులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పంటలకు ఎమ్మెస్పీ చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు ప్రయోజనాలను దెబ్బతీయడంతో పాటు వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేయడానికే కేంద్ర ప్రభుత్వం యోచిస్తుందని ఆరోపించారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం అన్నదాతలు సమష్టిగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. స్వామినాథన్ కమిషన్ అందించిన నివేదిక ప్రకారం పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కురుమన్న, రాములు, శ్రీను, రంగన్న, శివారెడ్డి, దిలీప్, నరసింహ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న రాజన్న ,తదితరులు

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



మానవపాడు: మండల పరిధిలోని చెన్నిపాడు పంట పొలాల్లో ఒరిగిన విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా దర్శన మిస్తోంది. అదే విధంగా గ్రామంలోని ఎస్సీ కాలనీలో నివాస గృహాలపై విద్యుత్ తీగలు ఉండడంతో ప్రజలు బిక్కు బిక్కుమంటూ ఉన్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భగీరథ పైప్‌లైన్ లీకేజీ



అయిజ: పట్టణ సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ అవుతుండడంతో ఆ ప్రాంతం మొత్తం బురుదగా మారింది. నెల రోజుల నుంచి పైప్‌లైన్ లీకేజీ అవుతున్నాసరే మిషన్ భగీరథ అధికారులు పట్టించుకోవడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. లీకేజీతో తాగునీరు కలుషితమవుతుందని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వసతి గృహంలో స్వచ్ఛ భారత్



స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో విద్యార్థులు



మడులు కడుతున్న విద్యార్థులు

ధరూరు: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు హాస్టల్ ఆవరణలోని పిచ్చి మొక్కలు తొలగించారు. అదే విధంగా ఆవరణలోని మొక్కలకు మడులు కట్టారు. కార్యక్రమంలో వార్డెన్ నర్సింహులు, విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రావణం పోయింది.. ముక్క ముట్టాల్సిందే..





శ్రావణమాసంలో చప్పబడిన నాలుకకు చేపల పులుసు, ఫ్రై ఘాటు తగిలించేందుకు ప్రజలు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వద్దకు బారులుతీరుతున్నారు. నెల రోజులుగా జనం లేక వెలవెలబోయిన ఎడమ కాల్వ వద్ద ఉన్న చేప వంటకాల హోటళ్లు ఆదివారం జనంతో కిక్కిరిసిపోయాయి. చేపల ఫ్రై కోసం హోటళ్ల వద్ద ప్రజలు గంటల తరబడి లైన్‌లో నిలబడాల్సి వచ్చిందంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

- అమరచింత

గుంతల రోడ్లు.. కూలిన కల్వర్టులు

- భారీ వర్షాలకు రోడ్లు ఛిద్రం
- రక్షణ గోడలు ధ్వంసం
- పట్టించుకోని అధికారులు



అలంపూర్ చౌరస్తా సర్వీస్ రోడ్డులో రక్షణ గోడ లేక ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

మల్దకల్: మండలంలోని ఎల్కూరు– మల్దకల్, మద్దెలబండ– మల్దకల్, బిజ్వారం– అమరవాయి గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలమయంగా మారి ప్రమాదాల బారిన పడుతున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాలకు వెళ్లే రోడ్లపై గుంతలు తవ్వి వదిలేయడంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదాలకు నిలయంగా

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు, పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు, గోకులపాడు, అమరవాయిల్లో రహదారులు గుంతలు పడి ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. ఆయా గ్రామాల్లో రాత్రుళ్లు రోడ్లపై ప్రయాణించాలంటేనే ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

అలంపూర్: అలంపూర్ చౌరస్తాలోని జాతీయ రహదారి ఫ్లెక్లీవర్ సర్వీస్ రోడ్డులో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. అలంపూర్ చౌరస్తా నుంచి కర్నూలు వైపు ఉన్న సర్వీస్ రోడ్డులో కల్వర్టుకు రక్షణ గోడ లేకపోవడంతో ప్రమాదకరంగా ఉంది. రాత్రుళ్లు కల్వర్టు గుంత కనిపించక రోడ్డు దిగితే పెను ప్రమాదమే సంభవించే అవకాశం ఉంది. నిర్వాహణ అధికారులు రక్షణ గోడ నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

కల్వర్టులను నిర్మించండి సారూ..

ఎర్రవల్లి: మండల పరిధిలోని వివిధ గ్రామాల సమీపంలో ఆర్‌అండ్‌బీ రహదారులపై గతంలో నిర్మించిన కల్వర్టులు వర్షాల కారణంగా పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో మండల కేంద్రం నుంచి ఆర్.గార్లపాడు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డులో కల్వర్టులు కూలి ఏళ్లు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఆర్.గార్లపాడు, సాసనూలు, షేకుపల్లి, గ్రామాల సమీపంలోని కల్వర్టులు కూలిన ప్రదేశంలో కూడా ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రక్షణగోడ నిర్మించాలి

ఇటిక్యాల: మండల పరిధిలోని మునగాల స్టేజీ సమీపంలోని కాల్వ వద్ద రక్షణ గోడ లేక ఇబ్బందులు పడుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. అదే విధంగా మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి సైతం గుంతలమయంగా మారి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నట్లు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతు చేయాలని అదే విధంగా కల్వర్టుల వద్ద రక్షణ గోడలు నిర్మించాలని ఆయా మండలాల ప్రజలు కోరుతున్నారు.



షేకుపల్లి కల్వర్టు వద్ద పాడైన తాత్కాలిక రోడ్డు



సాసనూలు వద్ద దెబ్బతిన్న కల్వర్టు